
సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 12 । ఆగస్టు । 2023



అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సత్తి సత్యనారాయణరెడ్డి, మంగాయమ్మ దంపతులు (రాజమహేంద్రవరం) శుక్రవారం రూ.1,01,116.విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు.

128 అధ్యాపక పోస్టుల మంజూరు



ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కొత్తగా 128 అధ్యాపక పోస్టులు మంజూర య్యాయని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదలవుతుందని వైస్ చాన్సలర్ ఆచార్య పద్మరాజు తెలిపారు.

II లో





అమలాపురం బహిరంగ సభా వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తదితరులు

అమలాపురం.. ఉత్తుంగ జనసాగరం

- ముఖ్యమంత్రి జగన్ సభకు వేలాదిగా తరలివచ్చిన జనం
- వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నిధులు జమ చేసిన సీఎం
- కిక్కిరిసిన సభా ప్రాంగణం.. బయట కూడా వేలాది మంది
- ప్రియతమ నేత ప్రసంగానికి అడుగడుగునా జేజేలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో వరుసగా నాలుగో ఏడాది కూడా వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ లబ్ధిని.. జమ చేసేందుకు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన వేళ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో జనసాగరం ఉప్పొంగింది. తమ బిడ్డను కళ్లారా చూసేందుకు ఫించన్లు పొందుతున్న అవ్వాతాతలు.. ప్రియ సోదరుడిని చూసేందుకు సున్నా వడ్డీ రాయితీ అందుకుంటున్న అక్కచెల్లెమ్మలు.. తమ అభిమాన నేతకు స్వాగతం పలికేందుకు యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జన ప్రియనేత రాకతో అమలాపురం జనజాతరను తలపించింది. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన అనంతరం అమలాపురంలో సీఎం జగన్ జరిపిన తొలి పర్యటన అంచనాలకు మించి విజయవంతం కావడంతో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఖుషీ అయ్యారు.

ఘన స్వాగతం

ఆర్డీఓ కార్యాలయం వెనుక పోలీస్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు ఉదయం 10.37 గంటలకు సీఎం జగన్ చేరుకున్నారు. అక్కడి నుంచి నల్ల వంతెన మీదుగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దారి పొడవునా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున బ్రహ్మరథం పట్టారు. దారికి ఇరువైపులా పలువురు మహిళలు ప్ల కార్డులు పట్టుకుని స్వాగతం పలికారు. అమలాపురంలో ఐదు గంటలు పైగా ఆయన గడిపారు.

అంచనాలకు మించి..

అమలాపురం మండలం జనుపల్లిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. ఆయన రావడానికి ముందే జిల్లా నలుమూలల నుంచీ మహిళలు, యువత పెద్ద ఎత్తున సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అంచనాలకు మించి జనం రావడంతో సభా ప్రాంగణం ముందుగానే నిండిపోయింది. దీనిని ముందే ఊహించిన జిల్లా యంత్రాంగం సభా ప్రాంగణాన్ని విస్తరించారు. అది కూడా చాలకపోవడంతో చాలా మంది స్టేడియం బయట ఉండిపోయారు.

మీరే నా సైనికులు

తన ప్రసంగంలో సీఎం జగన్.. 'మీరే నా సైనికులు' అని అనడంతో.. అందుకు సిద్ధమంటూ జనం ముక్తకంఠంతో నినదించారు. పలు సందర్భాల్లో యువతీ యువకులు, మహిళలు 'సీఎం.. సీఎం' అంటూ సభా ప్రాంగణాన్ని పెద్ద పెట్టున హోరెత్తించారు. వారికి జగన్ చిరునవ్వుతో అభివాదం చేశారు. సీఎం రావడానికి ముందు వివిధ సంక్షేమ పథకాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలు.. మహిళలకు అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ వినిపించిన ఆడియో ప్రసంగాలకు కూడా జనం నుంచి అనూహ్య స్పందన రావడం విశేషం. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా సభికులను అలరించాయి. వలంటీర్ల సేవలను వివరించినప్పుడు జనం పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు.



సీఎం జగన్ ప్రసంగానికి ప్రజల హర్షధ్వానాలు

బాధితుల గోడు విని..

సభ అనంతరం తిరిగి వెళ్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని.. పలువురు దివ్యాంగులు, వృద్ధులు, అభాగ్యులు, అనారోగ్యంతో బాధ పడుతున్న వారు హెలిపాడ్ వద్ద కలసి.. తమను ఆదుకోవాలని మొర పెట్టుకున్నారు. సుమారు 146 మంది వినతి పత్రాలు అందజేశారు. వారు చెప్పింది ఓపిగ్గా విన్న సీఎం జగన్.. వారితో ప్రేమగా మాట్లాడుతూ ఊరడించారు.

జిల్లా కేంద్రంపై వరాల వాన

జిల్లా కేంద్రమైన అమలాపురంపై సీఎం జగన్ వరాల వాన కురిపించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ విజ్ఞప్తి మేరకు పట్టణంలోని నల్లవంతెన, ఎర్రవంతెన, ఈదరపల్లి వంతెనలకు రూ.10 కోట్లు కేటాయించారు. అలాగే నియోజకవర్గంలోని 64 సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు రూ.40 లక్షల చొప్పున రూ.25.60 కోట్లు కేటాయిస్తున్నామని సీఎం జగన్ తెలిపారు.

స్వాగతం పలికిన నేతలు

తొలుత తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిపాడ్ వద్ద రాష్ట్ర గృహ నిర్మాణం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీలు పి.మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ స్వాగతం పలికారు. వీరితో పాటు ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు, పోతుల సునీత, ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు, కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, జక్కంపూడి రాజా, డాక్టర్ పినిపే శ్రీకాంత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, ఏపీ స్టేట్ అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ), రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన సాగిందిలా..

- ఉదయం 10.37: అమలాపురం పోలీస్ గ్రౌండ్‌లో హెలిపాడ్‌కు చేరిక.
- 11.18: సభా ప్రాంగణానికి చేరిక.
- 11.20: డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన.
- 11.25: మహిళా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులతో మాటామంతి.
- 11.30: అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు
- 11.58 – మధ్యాహ్నం 12.56: ప్రసంగం.
- 1.23 – 3.20: హెలిపాడ్‌కు చేరిక. గ్రీవెన్స్‌కు వచ్చిన బాధితుల గోడు విన్న సీఎం.
- 3.15: పార్టీ నాయకులతో సమావేశం.
- 3.56: హెలికాప్టర్‌లో తాడేపల్లి పయనం.

స్టాల్స్ సందర్శన.. మహిళలతో మాటామంతి

సభకు వచ్చిన వెంటనే జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం జగన్ సందర్శించారు. తాము తయారు చేసిన క్వాయర్, డ్రింక్స్, వెదురు బుట్టలు, ఆయిల్స్, ఫినాయిల్, ఇతర గృహోపకరణ వస్తువులు, లేసు వస్తువులను ఆయనకు మహిళలు చూపించారు. జిల్లాలో మహిళల అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలను సీఎం జగన్‌కు డీఆర్‌డీఏ పీడీ వివరించారు. వివిధ పథకాల వలన మహిళలకు అందిన పథకాలను వివరించినప్పుడు, మాజీ సీఎం చంద్రబాబును విమర్శించినప్పుడు.. సీఎం చెప్పినట్టుగా చేతులు ఊపుతూ జనం నినాదాలు చేశారు. అనంతరం ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులతో మాట్లాడిన సీఎం.. వారితో కలిసి ఫొటో దిగారు. అనంతరం సభా వేదిక మీదకు చేరుకున్న సీఎంకు జనం నినాదాలతో స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

అఖండ గోదావరిపై మరో వంతెన

ఎంపీ భరత్‌రామ్ విజ్ఞప్తిపై రైల్వేమంత్రి సానుకూల స్పందన



కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: అఖండ గోదావరి నదిపై మరో వంతెన రాబోతోంది. ఎంపీ మార్గాని భరత్‌రామ్ చొరవ ఫలించనుంది. శుక్రవారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎంపీ భరత్ మరోసారి కలిశారు. వంతెన విషయం ప్రతిపాదించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరంలోని మీడియాకు ఆయన ఫోన్ ద్వారా ఈ విషయం తెలియజేశారు. ధవళేశ్వరం వంతెన – రోడ్డు కమ్ రైల్వే బ్రిడ్జికి మధ్యలో కొత్త వంతెన రానుందన్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వంతెన మంజూరుకు సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే కార్యరూపం దాల్చబోతోందన్నారు. తన విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే శాఖ మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఒకవైపు రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై పలు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించడంతో పాటు కొత్త వంతెన కోసం ఎంపీ చేసిన కృషిపై నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో ఆంక్షలు

మధురపూడి(రాజమహేంద్రవరం): స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో స్థానిక విమానాశ్రయంలో పలు ఆంక్షలు విధించారు. ఈ మేరకు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులకు విమానాశ్రయంలోకి ప్రవేశం ఉండదన్నారు. ఈనెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రధాన ద్వారాల వద్ద భద్రతా దళాలు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తాయన్నారు. టెర్మినల్ భవనంలోకి ప్రయాణికులకు తప్ప ఇతరులకు అనుమతి లేదన్నారు. ప్రయాణికులకు వీడ్కోలు పలకడానికి వచ్చేవారు సైతం నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు.

మన కళలకు పూర్వ వైభవం

- 63 రోజుల పాటు దేశయాత్ర
- ప్రారంభించిన కలెక్టర్



నృత్యకళాకారిణిలతో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మన కళలకు ప్రాచీన వైభవం తీసుకురావడం కోసం భారత దేశ యాత్ర చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ మాధవీలత అన్నారు. రాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్ర, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన సంపూర్ణ భారత యాత్రను రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ వద్ద శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 63 రోజుల యాత్రలో భాగంగా సుమారు 17 వేల కిలోమీటర్లు ప్రయాణించి, సంగీత, నృత్య కార్యక్రమాల ద్వారా సనాతన ధర్మం కోసం చేస్తున్న యాత్ర దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు. యాత్ర పూర్తి చేసిన తరువాత నగరంలో పెద్ద ఎత్తున స్వాగత కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 12వ తేదీన కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నృత్యం చేసి యాత్రను ముగిస్తారన్నారు. దేశంలోని 22 రాష్ట్రాలలో సాగే ఈ యాత్ర విజయవంతం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులను భాగస్వాములు చేసిన తల్లిదండ్రులను అభినందిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం నుంచి యాత్రను కలెక్టర్, కమిషనర్, జేసీ, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. 63 రోజుల యాత్రకు గుర్తుగా 63 అడుగుల జాతీయ జెండాను కలెక్టర్ మాధవీలత ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ కళాక్షేత్ర ఫౌండర్, చైర్మన్ డాక్టర్ జీబీ నారాయణ, వారి నృత్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల స్వావలంబనకు ప్రభుత్వ సహకారం

వైఎస్సార్ సున్నావడ్డీ కింద స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.53.81 కోట్లు జమ



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాదవీలత, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో 36,816 స్వయం సహాయ సంఘాలలోని 3,95,844 మంది సభ్యులకు వైఎస్సార్ సున్నావడ్డీగా రూ.53.81 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు కలెక్టరు డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 9.48 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మల వడ్డీని జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టరు, జాయింట్ కలెక్టరు, మున్సిపల్ కమిషనరు,స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు. కలెక్టరు మాధవీలత మాట్లాడుతూ బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని స్వయం సహాయక గ్రూపుల సభ్యులకు వడ్డీ భారం పడకుండా వారి తరపున ప్రభుత్వమే వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో రీయింబర్స్ చేస్తోందన్నారు. డ్వాక్రా సంఘాల్లోని సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అక్కచెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలబడి జీవనోపాధిని మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం. వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాలతో సాయపడుతోందన్నారు. సుస్థిరమైన ఆర్థికాభివృద్ధికి బాట వేస్తోందన్నారు. స్వయంసహాయక మహిళలకు నెలకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ఆదనపు ఆదాయం సమకూర్చేందుకు అమూల్‌తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, అదనపు కమిషనర్ పి ఎం సత్య వేణి, డీఆర్‌డీఏ పీడీ ఎస్. సుభాషిణి, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



వందేళ్ల కల.. సాకారం

- జిల్లాలో చురుగ్గా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష సర్వే ప్రక్రియ
- తొలివిడతలో 40 పంచాయతీలు ఎంపిక
- ఇప్పటికే 11 గ్రామాల్లో పూర్తయిన సర్వే
- అక్టోబర్ 2 నాటికి నూరుశాతం పూర్తి

జిల్లాలో సర్వే వివరాలు

మొత్తం గ్రామ పంచాయతీలు	డోన్ ఫ్లై పూర్తయిన పంచాయతీలు
300	291
మొదటి విడత సర్వేకు ఎంపికైన గ్రామాలు	ఇప్పటికే సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాలు
40	13

ఆస్తి హక్కు పత్రాలకు సిద్ధమైన గ్రామాలు
11

నెలాఖరు నాటికి పూర్తి



ఈనెలాఖరుకు మొదటి విడత కింద 40 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తవుతుంది. అక్టోబర్ 2 నాటికి నూరుశాతం పూర్తవుతుంది. ఆధునిక డ్రోన్,రోవర్ల సాయంతో పారదర్శకంగా సర్వే కొనసాగుతోంది. వందేళ్ల తర్వత గ్రామకంఠాలకు సర్వే చేపట్టారు. ప్రజలు సర్వేకు సహకరించాలి.

–జానా సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి

కొవ్వూరు: గ్రామకంఠ భూముల్లో నివాసాలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. బ్రిటిష్ హయాంలో 1910–30 మధ్య సర్వే నిర్వహించారు. తర్వాత సర్వేలు చేపట్ట లేదు. ఫలితంగా గ్రామాల్లో ఇళ్లకు ఎటువంటి హక్కు పత్రాలూ లేవు. దీంతో కేంద్ర ప్రభుత్వం స్వమిత్ర (సర్వే ఆఫ్ విలేజ్ అబాడీ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్‌మెంట్ టెక్నాలజీ) ద్వారా గ్రామ కంఠ భూములు సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చొరవ తీసుకుంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు,భూ రక్ష పథకం అమలులోకి తెచ్చింది.



యాజమాన్య హక్కు ఆస్తి పత్రాలు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత,జేసీ తేజ్‌భరత్‌లు

ఆస్తుల గుర్తింపు

జిల్లాలో 18 మండలాలలోని 300 గ్రామ పంచాయతీల పరిధిలో 272 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలో 291 పంచాయతీల్లో డ్రోన్ ఫ్లై పూర్తి చేశారు. ప్రతి ఇంటి నుంచి 38 రకాల వివరాలు సేకరిస్తున్నారు. గ్రామ కంఠంలోని ప్రభుత్వ ఆస్తులు,అసైన్డ్ ఆస్తులు,ప్రవేటు ఆస్తులను గుర్తిస్తున్నారు. తద్వారా అర్హత కలిగిన వారికి ఆస్తి హక్కు పత్రాలు అందిస్తున్నారు.

ఈ పత్రం తీసుకుంటే బ్యాంకుల నుంచి రుణం వచ్చు. ,క్రయ, విక్రయాలకు,ఇతర లావాదేవీలకు వీలుంటుంది.అత్యాధునిక డ్రోన్లు, రోవర్ల సాయంతో సర్వే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది.

మొదటి దశలో నలభై గ్రామాలు

మొదటి దశలో 40 గ్రామ పంచాయతీలను సర్వేకు ఎంపిక చేశారు. అనపర్తి మండలం పది,బిక్కవోలు మండలంలో 11 ,రాజానగరంలో ఐదు,చాగల్లు,కొవ్వూరు,రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో రెండేసి గ్రామాల చొప్పున, తాళ్లపూడి, గోపాలపురం, కడియం, దేవరపల్లి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం,రంగంపేట మండలాల్లో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు.

ఇదీ పురోగతి

- 27 గ్రామాల్లో ట్రూతీంగ్ పూర్తి చేశారు. మరో 13 గ్రామాల్లో పురోగతిలో ఉంది.
- 25 గ్రామ పంచాయతీల్లో వేలీడేషన్ పూర్తయింది.రెండు గ్రామాల్లో చురుగ్గా జరుగుతోంది.
- 20 గ్రామ పంచాయతీల్లో సర్వే పూర్తి చేసి నోటీఫికేషన్ జారీ చేశారు. డ్రాఫ్ట్ ప్రకటన జారీ చేశారు.
- 13 పంచాయతీల్లో సర్వే ఆఫ్ ఇండియాకు రైట్ ఆఫ్ రికార్డు సమర్పించారు. వీటిలో 11 గ్రామాల్లో ఆస్తి హక్కు కార్డులు అందాయి.
- కొవ్వూరులో మొదటిసారి శుక్రవారం హోమ్ మంత్రి తానేటి వనిత ఆస్తి హక్కు పత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి



సుభాష్ (పాత చిత్రం)

నిడదవోలు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ రేషన్ డీలర్ మృతి చెందాడు. ఏఎస్సై పరమహంస శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన బయ్యే సుభాష్ (29) అదే గ్రామంలో రేషన్ డీలర్‌గా పని చేస్తున్నాడు. నిడదవోలు వెళుతున్నానని చెప్పి గురువారం రాత్రి మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. గ్రామ శివారున ఉన్న చోళ్లమ్మ గుడి వద్ద ఆగి ఉన్న చెత్త రిక్షాను ఢీకొట్టడంతో సుభాష్ తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. 108లో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. సుభాష్ తల్లి ఝాన్సీరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుభాష్ రెండు రోజులుగా కళ్లకలకతో బాధ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో బైక్‌పై వెళ్తూ చీకట్లో కళ్లు సరిగ్గా కనిపించక ఈ ప్రమాదానికి గురైనట్టు పోలీసులు భావిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి ఝాన్సీరాణితో పాటు బంధుమిత్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. నలుగురితో మంచిగా ఉంటూ రేషన్ డీలర్‌గా అందరితో ఆప్యాయంగా ఉండే సుభాష్ మృతి చెందడాన్ని స్నేహితులు, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

16, 17 తేదీల్లో అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ గోదావరి జోన్ ఆధ్వర్యాన ఈ నెల 16, 17 తేదీల్లో సబ్ జూనియర్స్ బాలురు, బాలికల అంతర్ జిల్లా ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. జోన్ కో ఆర్డినేటర్ నీలాద్రికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ పోటీల్లో తూర్పు గోదావరి, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలు తలపడతాయన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలు, రన్నర్స్ నేరుగా రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా చాంపియన్‌షిప్‌కు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ పోటీలకు హాజరు కావాలని ఆయన కోరారు.



క్యూ కట్టి.. జగనన్నకు జైకొట్టి..: అమలాపురం వీధుల్లో బారులు తీరి సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న జనం



అడుగడుగో మన అన్న..: బస్సులో వస్తున్న సీఎం జగన్‌ను చూసి ప్రజల హర్షాతిరేకాలు



పూలజల్లుల్లో..: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వాహనంపై పుష్పవర్షం కురిపిస్తున్న ప్రజానీకం



జగనన్నే మా భవిష్యత్తు: సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అక్కచెల్లెమ్మలు

ప్రియ నేతకు బ్రహ్మరథం



ఇదెలా పని చేస్తుంది?: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆవిర్భవించిన అనంతరం.. తొలిసారిగా ఈ జిల్లా కేంద్రం అమలాపురానికి శుక్రవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అశేష ప్రజానీకం బ్రహ్మరథం పట్టారు. ఆర్‌డీఓ కార్యాలయం వెనుక హెలిపాడ్ నుంచి నుంచి సభా స్థలి.. జీఎంసీ బాలయోగి స్టేడియం ప్రాంగణం వరకూ వేలాదిగా జనం.. ముఖ్యంగా మహిళలు, యువత ప్లకార్డులు చేబూని.. బారులు తీరి తమ ప్రియనేతకు ఘన స్వాగతం పలికారు. తమ భవిష్యత్తు జగనన్నే అంటూ పెద్ద పెట్టున నినదించారు. సీఎం వస్తున్న బస్సుపై పూలజల్లులు కురిపించారు. ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించారు. పలు సందర్భాల్లో సీఎం ప్రసంగానికి ప్రతిస్పందిస్తూ.. 'సీఎం సీఎం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



జ్యోతి ప్రకాశనం: సభను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అమలాపురం ఎంపీ చింతా అనురాధ. చిత్రంలో మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



అశేష జనవాహిని తోడుగా..: సభకు తరలివస్తున్న సీఎం జగన్



అన్నకు గోడు చెప్పుకుందామని..: సభకు వస్తున్న దివ్యాంగుడు



జనగోదారిలా..: అమలాపురంలో సీఎం సభకు సాగుతున్న ప్రజా ప్రవాహం



అన్నకు ప్రేమతో..: సీఎం జగన్‌కు జ్ఞాపిక అందిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు



హాయ్ మామయ్యా..: సీఎం జగన్‌కు విద్యార్థుల అభివాదం



యువజనోత్సాహం: అభిమాన నేత సీఎం జగన్‌ను కళ్లారా చూడాలని..

నట్టేట ముంచిన ముష్కరుడికి సంకెళ్లు

- గోదావరిలోకి తోసి తల్లీబిడ్డల ప్రాణాలు తీసిన నిందితుడి అరెస్టు
- హత్య, హత్యాయత్నం కేసుల నమోదు
- జిల్లా ఎస్పీ శ్రీధర్ వెల్లడి



పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్‌బాషా, డీఎస్పీ రమణ

అమలాపురం టౌన్: సహజీవనం చేస్తున్న మహిళను, తమ పిల్లలను నమ్మించి, గోదావరిలోకి తోసేసి ఇద్దరి మృతికి కారకుడైన ముష్కరుడు ఉలవ సురేష్‌ను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. అతడిపై హత్య, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. తన కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సుహాసినికి 13 ఏళ్ల కుమార్తె లక్ష్మీ సాయి కీర్తన ఉంది. భర్తతో విభేదాలు రావడంతో ఆమె తన కుమార్తెతో తాడేపల్లి చేరుకుని ఒంటరిగా ఉండేది. ఆమెతో ప్రకాశం జిల్లా దర్శికి చెందిన సురేష్ పరిచయం పెంచుకున్నాడు. క్రమంగా వారిద్దరూ సహజీవనం ఆరంభించారు. ఈ క్రమంలో వారికి జెస్సీ జన్మించింది. సుహాసినితో సహజీవనం సాగిస్తూనే సురేష్ ఇటీవల మరో యువతిని రహస్యంగా వివాహం చేసుకున్నాడు. ఇదే సమయంలో సుహాసిని వద్ద కొంత డబ్బు తీసుకుని, ఇవ్వడం లేదు. ఈ రెండు అంశాలపై సురేష్‌పై ఆమె కొన్నాళ్లుగా ఒత్తిడి తీసుకువస్తోంది. దీంతో ఆమెను వదిలించుకోవాలని సురేష్ నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో రావులపాలెం వద్ద ఉన్న గౌతమీ గోదావరి వంతెన వద్ద రెక్కీ నిర్వహించాడు. ఆ వంతెన పైనుంచి తల్లీబిడ్డలను గోదావరిలోకి తోసి, చంపాలని పథకం పన్నాడు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో షాపింగ్ చేద్దామని వారిని నమ్మించాడు. రెక్కీ చేసిన మర్నాడు తాడేపల్లిలో ఓ కారు అద్దెకు తీసుకుని సొంతంగా డ్రైవ్ చేసుకుంటూ సుహాసిని, ఇద్దరు పిల్లలతో బయలుదేరాడు. రాజమహేంద్రవరంలో పని పూర్తయ్యాక ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున రావులపాలెం వంతెన వద్దకు తీసుకుని వచ్చాడు. గోదావరి వ్యూ బాగుంటుందని వారిని నమ్మించి, వంతెన పిట్టగోడపై కూర్చోమని, ఫొటోలు తీస్తానని చెప్పాడు. ఆ సమయంలో వారిని సురేష్ ఒక్కసారిగా గోదావరిలోకి తోసేసి అక్కడి నుంచి భీమవరం పరారయ్యాడు. సుహాసిని, జెస్సీ గోదావరిలో పడి గల్లంతయ్యారు. వారి మృతదేహాలు బుధవారం లభ్యమైన విషయం తెలిసిందే.

కీర్తనకు సాహస అవార్డుకు సిఫారసు

సురేష్ గోదావరిలోకి తోసేసిన క్రమంలో సుహాసిని కుమార్తె లక్ష్మీ సాయి కీర్తన వంతెనకు ఉన్న కేబుల్ పైపులైన్ పట్టుకోవడం.. ధైర్యం తెచ్చుకుని, సమయస్ఫూర్తితో తన వద్ద ఉన్న స్మార్ట్ ఫోనుతో పోలీసులకు 100 నంబరుకు డయల్ చేయడం.. పోలీసులు తక్షణమే ఆ బాలికను రక్షించడం వంటి పరిణామాలు తెలిసిందే. అత్యంత ధైర్యసాహసాలతో తన రక్షణకు ప్రయత్నించిన కీర్తనకు ప్రభుత్వపరంగా సాహస అవార్డుకు సిఫారసు చేసినట్టు ఎస్పీ శ్రీధర్ తెలిపారు. కోలుకున్న కీర్తనను వారి బంధువులకు అప్పగించామని, ఆమెకు ఏ అవసరం వచ్చినా అందించేందుకు పోలీసులు ముందుంటారని చెప్పారు. తనకు స్కూలులో దిశ యాప్, డయల్ 100 గురించి పోలీసు అధికారులు అవగాహన కల్పించడం వల్లే 100 నంబరుకు ఫోన్ చేశానని చెప్పిన కీర్తన సమయస్ఫూర్తిని అభినందించారు.

తక్షణమే స్పందించిన పోలీసులకు రివార్డులు

ఆపదలో ఉన్న కీర్తన నుంచి డయల్ 100కు ఫోన్ రాగానే అత్యంత వేగంగా స్పందించి ఆ బాలికను కాపాడిన రావులపాలెం పోలీసులను ఎస్పీ అభినందించారు. కొత్తపేట డీఎస్పీ రమణ, రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సైలు ఎం.వెంకటరమణ, ఎం.ప్రేమ్‌కుమార్, రావులపాలెం పోలీసులు ఏవీవీ సత్యనారాయణ, గాడి సురేష్, వనుము విజయ్‌కుమార్, జి.గోపి, పి.సుధాకర్, నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు రొక్కాల రవిబాబు, పాలింగ ప్రభాకర్, గంగలకుర్తి సురేష్‌లకు రివార్డులు అందించారు. విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నేను చస్తేనే కానీ నువ్వు మారవు..

- కుమారుడి తీరుతో మహిళ మనస్తాపం
- ఉరి వేసుకుని ఆత్మహత్య

కొత్తపేట: కుమారుడు ఖాళీగా ఉంటున్నాడనే మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ఏఎస్సై ఐ.బ్రహ్మాజీరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాడపాలెం మారెమ్మ మాన్యం ప్రాంతానికి చెందిన బండారు వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి (52) దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భాస్కర సుబ్రహ్మణ్యం ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో అతడిని తండ్రి తరచూ మందలిస్తున్నాడు. గురువారం రాత్రి కూడా సుబ్రహ్మణ్యాన్ని తండ్రి మందలిస్తుండగా.. తల్లి వెంకటలక్ష్మి మనస్తాపం చెందింది. 'నేను చస్తేనే కానీ నువ్వు మారవు' అంటూ గదిలోకి వెళ్లి, ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కిటికీకి చున్నీతో ఉరి వేసుకుంది. ఆమె వేళ్లాడుతూ ఉండటాన్ని ఇంటి పక్కనే ఉంటున్న కోలా సత్యవతి గమనించి, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వెంటనే వెంకటలక్ష్మిని కుటుంబ సభ్యులు కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గొడ్డటిపాలేనికి చెందిన యేసెట్టి ఏసుబాబు (42) శారీరక సమస్యతో బాధ పడుతూ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల కుక్కకాటుకు గురయ్యాడు. అప్పటినుంచీ భార్యపై చిరాకు పడుతూ ఉండేవాడు. గురువారం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఏసుబాబును బంధువులు 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. కుమార్తె దుర్గాభవాని ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

128 అధ్యాపక పోస్టుల మంజూరు

- భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్
- 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కొత్తగా 128 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదలవుతుందని వైస్ చాన్సలర్ ఆచార్య పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో విద్యా బోధనకు 162 మంది అధ్యాపకులు అవసరం కాగా ప్రస్తుతం 25 మంది మాత్రమే ఉన్నారన్నారు. అయినప్పటికీ వారు చూపుతున్న శ్రద్ధ, సమర్థతతో మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించేందుకు పూర్తి స్థాయిలో అధ్యాపకులు, మౌలిక సదుపాయాల వంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. ఇందులో భాగంగానే న్యాక్–బి+ గ్రేడ్ సాధించగలిగామన్నారు. ఎ+ గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తామన్నారు. న్యాక్ గుర్తింపు వలన గ్రేడ్‌లను బట్టి వర్సిటీకి నేషనల్ రీసెర్చ్ ఫండ్ కేటాయిస్తారని తెలిపారు. నిధులు వస్తే అభివృద్ధి కూడా వేగంగా జరుగుతుందన్నారు. గోదావరి వాసుల చిరకాల స్వప్నంగా సాకారమైన నన్నయ యూనివర్సిటీ ద్వారా గ్రామీణ యువతను విద్యావంతుల్ని చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వీసీ తెలిపారు. వర్సిటీలో నూతన విద్యా విధానం అమలు చేస్తూ, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వర్సిటీలో కాలేజీ డెవలప్‌మెంట్ సెల్, పరీక్షల నిర్వహణలో ఆటోమేషన్ విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాలేజీల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుబంధ కళాశాలలను ప్రతి మూడు నెలలకోసారి వర్చువల్‌గా పరిశీలిస్తున్నామన్నారు.

రూ. 25.5 కోట్లతో హాస్టల్ భవనాలు

వర్సిటీ క్యాంపస్‌లో ప్రస్తుతం రెండు బాలుర, బాలికల హాస్టళ్లు ఉన్నాయని, వీటికి అదనంగా రూ.25.5 కోట్లతో మరో రెండు హాస్టళ్లు నిర్మిస్తున్నామని ఆచార్య పద్మరాజు తెలిపారు. రూ.16.5 కోట్లతో బాలికలకు, రూ.9 కోట్లతో బాలురకు అదనపు హాస్టళ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. వీటితో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో కూడా అవసమైన భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు.

16, 17 తేదీల్లో సహస్రాబ్ది ఉత్సవాలు

వెయ్యేళ్ల చరిత్ర కలిగిన నగరాల్లో రాజమహేంద్రవరం ఒకటని, ఈ సందర్భంగా ఆదికవి నన్నయ, రాజరాజనరేంద్రుడి పేరిట ఈ నెల 16, 17 తేదీల్లో కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో సహస్రాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆచార్య పద్మరాజు తెలిపారు. ఈ ఉత్సవాలకు అనేక మంది ప్రముఖులు హాజరు కానున్నారని చెప్పారు. విలేకర్ల సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు కేఎస్ రమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి, కె.రమణేశ్వరి, పి.విజయ నిర్మల, పి.వెంకటేశ్వరరావు, ఎస్.ఉదయ్ భాస్కర్, కె.నూకరత్నం, ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో... అలర్జీ!

డోంట్ వర్రీ! నివారించండి ఇలా!



మనం తీసుకునే ఆహారం వల్ల... పీల్చే గాలి వల్ల లేదా వాడే మందుల వల్ల మన రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించి అలర్జీకి దారి తీస్తుంది. అలర్జీపై అలసత్వం కూడదని, కొన్ని అలర్జీలు ప్రాణాంతకం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనం కామన్‌గా ఎదుర్కొనే రకరకాల అలర్జీలు, కారణాలు, నివారణలపై అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.

గుర్తించేదిలా...

ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించి ఆ తరువాత మీ అలర్జీ కారకాలను గుర్తించడానికి చర్మ పరీక్షలు, ప్యాచ్ లేదా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నివేదికల ఆధారంగా మీరు ఏరకమైన అలర్జీలతో బాధపడుతున్నారో నిర్ధారించుకొని తగిన చికిత్సను సిఫార్సు చేస్తారు. అలర్జీలకు సరైన చికిత్సను నిర్ధారణ పరీక్షల ఆధారంగానే కాకుండా బాధితుడి మెడికల్ హిస్టరీ, లక్షణాల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అందిస్తారు. ఈ రుగ్మతకు శాశ్వత పరిష్కారం లేదు. దీన్ని ఏదో ఒక చికిత్సా విధానం ద్వారా అదుపులో మాత్రమే ఉంచుకోవచ్చు.

ఆహారం.. అలర్జీ!

మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు ఫుడ్ అలర్జీలకు దారితీస్తాయి. సాధారణంగా అందరూ తీసుకునే గుడ్లు, పాలు, వేరుశెనగ, చేపలు, రొయ్యలు, పీతలు, సోయా, కొన్ని రకాల నట్స్ (అక్రోట్స్, బాదం, బ్రెజిల్ నట్స్), గోధుమ వంటి ఆహార పదార్థాలు కొందరి శరీర తత్వానికి సరిపడవు. వీరు వీటిని తీసుకోవడం వల్ల ఆహారానికి సంబంధించిన అలర్జీలు వస్తాయి. శరీరానికి ఈ పదార్థాలు సరిపడకపోతే దురద, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా కడుపు తిమ్మిర్లు, శ్వాస తీసుకోలేకపోవటం, గురక, దగ్గు, గొంతునొప్పి, పల్స్ పడిపోవడం, చర్మం నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఫుడ్ అలర్జీల నిర్ధారణకు చర్మ పరీక్షతో పాటు రక్త పరీక్షలు (ఐజీఈ యాంటీబాడీస్) కూడా చేయాల్సి ఉంటుంది.



ఏం చేయాలి?

శరీరంలో అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే అలర్జీ స్పెషలిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం. డాక్టర్‌తో మీ ఫ్యామిలీ హిస్టరీ, జీవనశైలి, వాడుతున్న మందులు తదితర వివరాలను తెలియజేస్తే, దానికి తగిన నిర్ధారణ పరీక్షలను సూచిస్తారు. ముందుగా ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష,

కొంతమందిలో తేనెటీగలు, కందిరీగలు (ఇన్సెక్ట్ అలర్జీ), రబ్బరుతో తయారయ్యే వస్తువులు (బెలూన్, చేతి తొడుగులు, కాండమ్స్), కొన్ని రకాల మందులు(డ్రగ్ అలర్జీ), ఫంగస్ (మోల్డ్ అలర్జీ) లాంటివి కూడా కనిపిస్తుంటాయి.

డస్ట్ అలర్జీ

సాధారణంగా డస్ట్ అలర్జీ అనేది దుమ్ము, ధూళి వల్ల, వాటిలోని సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుంది. వీటిని డస్ట్ మైట్స్ అంటారు. ఈ డస్ట్ మైట్స్ మనుషుల నుంచి రాలిన చర్మ మృతకణాలను తింటూ ఇంట్లో దుమ్ము, ధూళికి కారణమవుతాయి. ఇవి శ్వాస తీసుకునే క్రమంలో శరీరంలోకి ప్రవేశించి శ్వాసనాళాల వాపునకు కారణమవుతాయి. దీనివల్ల తుమ్ములు, ముక్కు కారడం, కంటిలో దురద, కళ్ళలో నుంచి జిగటతో కూడిన నీరు, ఒళ్లంతా దురద, ముక్కు దిబ్బడ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన ఇళ్లలో ఉండే తేమ పరిస్థితులు ఈ డస్ట్ మైట్స్‌కు ఆవాసాలు. కాబట్టి ఇళ్లలో ఉండే దుప్పట్లు, దిండు కవర్లు, టవల్‌లు, తివాచీలు, ఇతర సామాన్లను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. డస్ట్ అలర్జీ కారకాలను గుర్తించడానికి స్కిన్ ప్రిక్ టెస్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. డస్ట్ అలర్జీతో బాధపడేవారు 80 శాతం మంది ఆస్తమా రోగులుగా మారుతున్నారు.



కంటి అలర్జీ



సాధారణంగా కంటి అలర్జీలు పుప్పొడి, డస్ట్‌మైట్స్, పెంపుడు జంతువుల చర్మ కణాలు వంటి వాటి వల్ల సంభవిస్తాయి. వీటి వల్ల కళ్లలో దురద, వాపు, మంట, జిగట నీరు కారడం, ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ రకమైన అలర్జీలు అంటువ్యాధులు కావు. కంటి అలర్జీలకు ప్రత్యేకమైన నిర్ధారణ పరీక్షలు ఏవీ ఉండవు. పైన పేర్కొన్న కారకాల్లో ఏవి అలర్జీకి కారణం అవుతున్నాయో పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే నివారణ.

స్కిన్ అలర్జీ

స్కిన్ అలర్జీ అంటే కేవలం చర్మ సంబంధిత అలర్జీ అనే అపోహ చాలామందిలో ఉంటుంది. స్కిన్ అలర్జీతో బాధపడే వారిలో విపరీతమైన దురద, చర్మంపై దద్దుర్లు, పొడి చర్మం, మంట, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, మందులు, అంటు వ్యాధులు వంటి పలు కారణాల చేత ఇవి సంభవిస్తాయి. పెంపుడు జంతువులు, రసాయనాలు, సబ్బులు, కొత్తబట్టలు, స్కిన్ లేదా ఫేస్ క్రీమ్‌లు వంటివి చర్మ అలర్జీలకు ప్రధాన కారకాలు. చాలామందిలో ఈ అలర్జీల కారకాలను పరీక్షల ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే సాధారణ రక్త పరీక్ష (తెల్ల రక్త కణాల పరీక్ష) ద్వారా బాధితుడి లక్షణాలను కొద్దిమేరకు గుర్తించే ప్రయత్నం చేయవచ్చు. మన చర్మం దేనికి ప్రతిస్పందిస్తుందో జాగ్రత్తగా పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే దీనికి నివారణ.



హెల్త్ టిప్స్

చలవ చేసే మిరియాలు



మిరియాలు మంచి ఘాటు వాసనను కలిగి ఉంటాయి. ఈ కారణంగానే వీటిని మసాజ్ ఆయిల్ తయారీలో ఒక వనరుగా ఉపయోగిస్తారు. ఈ ఆయిల్‌తో మర్దనా చేసుకోవడం లేదా కొన్ని చుక్కలు నీటిలో కలుపుకొని స్నానం చేస్తే కండరాల నొప్పులు, ఒళ్లు నొప్పులు, గాయాలు తగ్గుతాయి.

గ్లాసు మంచినీరు, ఐదు లేక ఆరు మిరియాలు, ఒక ముక్క తెల్ల ఉల్లిపాయ, చితక్కొట్టిన అల్లం ముక్క ఒకటి, చిన్న బెల్లం ముక్క ఇవన్నీ వేసి నీరు సగం అయ్యేంత వరకు కాచండి. వేడిగా ఉండగానే తాగండి. దీనిని సేవించడం వల్ల దగ్గు, జలుబు, గొంతు నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

భరించరానంత తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడు సార్లు తినాలి.

ఆరోగ్యానికి రక్ష డ్రాగన్ ఫ్రూట్

పండ్లలో డ్రాగన్ ఫ్రూట్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే ఇవి చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందువల్ల వీటిని చిన్న పిల్లల నుంచి పెద్దవారి దాకా ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. వీటిని తినడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే మూలకాలు అన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి.



ప్రస్తుతం చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో అధిక పరిమాణంలో అనేక విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. కాబట్టి జుట్టు సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది...
డ్రాగన్ ఫ్రూట్‌లో అధికమోతాదులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల వీటిని తీసుకునేవారికి రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, ఫ్లూ, జలుబు వంటి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం లభిస్తుంది. అంటు వ్యాధులు రాకుండా శరీరాన్ని కూడా కాపాడుతుంది.



జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది...
డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే ఫైబర్ పరిమాణాలు తీవ్ర జీర్ణక్రియ సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా మలబద్ధకం, పొట్ట నొప్పులతో బాధపడేవారు ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది.

గర్భధారణ సమయంలో...
గర్భధారణ సమయంలో మహిళలు తరచు ఏదో ఒక విధమైన అనారోగ్య సమస్యలకు గురవుతారు. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి ప్రతి రోజు డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా అధికంగా పరిమాణంలో లభిస్తుంది. దీంతో ఈ విటమిన్ సి లోపం నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

వాపు నుంచి ఉపశమనం...
చాలా మందికి శరీరంలోని కొన్ని భాగాలలో వాపు, శరీరమంతటా మంటలు వస్తుంటాయి. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు వైద్యుని సంప్రదించేముందు డ్రాగన్ ఫ్రూట్ తీసుకుని చూడాలి. అప్పటికీ తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను కలవాలి. ఎందుకంటే ఇందులో ఉండే సమ్మేళనాలతో ఆయా సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.

కొలెస్ట్రాల్‌ను అదుపు చేస్తుంది...
తరచు కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడేవారు గుండె జబ్బుల బారిన పడే అవకాశాలున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి డ్రాగన్ ఫ్రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

మీకు తెలుసా?

కంటికి మరీ దగ్గరగా పెట్టుకుంటే...



కంటి సామర్థ్యం, పనితీరు వంటి అంశాలు మహిళలకైనా, పురుషులకైనా సాధారణంగా ఒకేలా ఉంటాయి. ఒకవేళ కంటికి ఏవైనా సమస్యలు వస్తే అవి కూడా ఒకేలా రావాలి. కానీ... కంటికి దగ్గరగా పెట్టుకుని పుస్తకాల్ని చదివేవారిలో పురుషులతో పోలిస్తే మహిళల్లో సమస్యలు కాస్తంత ఎక్కువని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన అధ్యయనవేత్తలు గుర్తించారు. ఇందుకు కారణాన్ని సైతం అధ్యయనవేత్తలు శాస్త్రీయంగా విశ్లేషించారు.

అవేమిటంటే... పురుషుల చేతుల నిడివితో పోలిస్తే మహిళల చేతులు నిడివి కాస్తంత తక్కువ. ఫలితంగా చదివే సమయంలో పురుషులతో పోలిస్తే మహిళల కళ్లకు పుస్తకం ఒకింత దగ్గరగా ఉంటుంది. దాంతో ప్రెస్బయోపియా అనే కండిషన్ మహిళలకు వేగంగా వస్తుంది. అంటే దగ్గరి చూపు తగ్గడం అన్న సమస్య చాలా త్వరగా రావచ్చు. మహిళలు దీర్ఘకాలం పాటు ఇలా పుస్తకాలను చాలా దగ్గరగా చదువుతుండటం మూలాన బైఫోకల్ లెన్స్‌ను లేదా రీడింగ్ గ్లాసెస్‌ను చాలా త్వరితంగా ఉపయోగించాల్సి వస్తోందని పరిశోధనలు తెలుపుతున్నాయి. అయితే ప్రెస్బయోపియా అన్న సమస్యకు అనేక కారణాలు ఉంటాయని, ఒక్కొక్కరి వ్యక్తిగత అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ సమస్యకు కరెక్షన్స్ సూచించాల్సి ఉంటుందని కూడా పరిశోధకులు పేర్కొన్నారు.

సినిమా


వింటేజ్ కింగ్?


ప్రభాస్

ఇంతకీ ఆ టైటిల్‌ని ఫిక్స్ చేశారా? ఈ టైటిల్ అనుకుంటున్నారా అంటూ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం గురించి చర్చ జరుగుతోంది. ఈ చిత్రం టైటిల్‌ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే 'రాజా డీలక్స్' అని ఫిక్స్ చేశారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా 'వింటేజ్ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారనే వార్త వెలుగులోకి వచ్చింది. మరి.. వార్తల్లో ఉన్నట్లు 'రాజా డీలక్స్'ని ఫిక్స్ చేశారా? లేక 'వింటేజ్ కింగ్' అనుకుంటున్నారా? అనేది తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

డబ్బింగ్ ఆరంభం
ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న విడుదల కానున్న సంగతి తెలిసిందే. విజయ్ కిరగందూర్ ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ వర్క్‌ను ఆరంభించారు. మరోవైపు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'కల్కి 2898 ఏడీ' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే.

శ్రీకాంత్ అడ్డాల డైరెక్షన్‌లో?


అఖిల్

'ఏజెంట్' తర్వాత అఖిల్ కొత్త సినిమా గురించిన అధికారిక ప్రకటన ఇంకా వెల్లడి కాలేదు. అయితే అనిల్ అనే ఓ కొత్త దర్శకుడితో అఖిల్ సినిమా చేయనున్నారని, ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని ప్రచారం జరిగింది. తాజాగా దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలతో అఖిల్ ఓ సినిమా చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. శ్రీకాంత్ ఓ కథను రెడీ చేసి, అఖిల్‌కు వినిపించారట. ఈ స్క్రిప్ట్ అఖిల్‌కి నచ్చిందని సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే అఖిల్ – శ్రీకాంత్ అడ్డాల కాంబినేషన్‌లోని సినిమా ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కించిన 'పెద కాపు 1' ఈ నెలలోనే విడుదల కానుంది. ఒకవేళ అఖిల్‌తో సినిమా కన్ఫార్మ్ అయితే.. 'పెద కాపు 1' విడుదల తర్వాత ప్రకటన వస్తుందేమో?

నీకిదే స్వాగతాంజలి


కంగనా రనౌత్

'లాస్య విలసిత.. నవ నాట్యదేవత.. నటనాంకిత అభినయ వ్రత చారుధీర చరిత స్వాగతాంజలి.. స్వాగతాంజలి' అంటూ సాగే పాట 'చంద్రముఖి 2' చిత్రంలోనిది. రాఘవా లారెన్స్, లక్ష్మీ మీనన్, కంగనా రనౌత్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. పి. వాసు దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబరు 15న విడుదల కానుంది. ఈ చిత్రంలో చంద్రముఖి పాత్రధారి కంగనా రనౌత్‌పై చిత్రీకరించిన 'ఓ చంద్రముఖి నీకిదే స్వాగతాంజలి' పాట తెలుగు, తమిళ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. యం.యం. కీరవాణి స్వరకల్పనలో చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించిన ఈ పాటను శ్రీనిధి తిరుమల పాడారు. ఇక రజనీకాంత్ హీరోగా జ్యోతిక, ప్రభు, నయనతార లీడ్ రోల్స్‌లో పి. వాసు దర్శకత్వంలో రూపొందిన 'చంద్రముఖి' చిత్రం 2005లో విడుదలై ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' తెరకెక్కింది.

పోలీస్ స్టేషన్‌లో...


కేథరిన్

హీరోయిన్ కేథరిన్ ట్రెసా పోలీస్ స్టేషన్‌లో ఉన్నారు. ఆమె పోలీసాఫీసర్ కాదు.. ఖైదీ కూడా కాదు. మరి.. పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్లారంటే.. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా. కేథరిన్ హీరోయిన్‌గా 'జార్జిరెడ్డి, వంగవీటి' చిత్రాల ఫేమ్ సందీప్ మాధవ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో సందీప్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు. కేథరిన్ క్యారెక్టర్ ఏంటనేది తెలియాల్సి ఉంది. అయితే ఎవరూ ఊహించని రీతిలో ఆమె పాత్రను డిజైన్ చేశారట చిత్రదర్శకుడు అశోక్ తేజ. ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన పోలీస్ స్టేషన్ సెట్‌లో సందీప్, కేథరిన్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్‌లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. ''స్క్రీన్‌ప్లే బేస్డ్ చిత్రమిది. సరికొత్త యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం కొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమాలో ఎవరూ ఊహించని మలుపులు ఉంటాయి. ప్రతి సీన్ ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు దర్శకుడు.

అందుకే స్పందించా!


విశాల్

''సాధారణంగా నేను వదంతులకు, అబద్ధపు వార్తలకు స్పందించను. ఎందుకంటే అవి పూర్తిగా అనవసరమైన విషయాలు. కానీ ఇప్పుడు స్పందించడానికి కారణం ఈ వార్తతో ఒక అమ్మాయి జీవితం ముడి పడి ఉండడమే'' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు విశాల్. హీరోయిన్ లక్ష్మీ మీనన్, విశాల్ పెళ్లి చేసుకోనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్తను ఉద్దేశించే విశాల్ పై విధంగా పేర్కొన్నారు. ''లక్ష్మీ మీనన్‌తో నా పెళ్లనేది నిజం కాదు. మా ఇద్దరి పెళ్లంటూ వస్తున్న వార్తను ఖండిస్తున్నాను. ఒక అమ్మాయి వ్యక్తిగత జీవితానికి నష్టం కలిగించడం సరి కాదు. భవిష్యత్తులో నేను ఎవర్ని, ఏ తేదీ, ఏ టైమ్‌లో పెళ్లి చేసుకుంటాననేది తెలుసుకోవడం అందరికీ పెద్ద కష్టమేం కాదు. అయినా సమయం వచ్చినప్పుడు నా పెళ్లి గురించి నేనే చెబుతాను'' అని కూడా విశాల్ అన్నారు.

చందమామ కథలోన..


రక్షిత్, రాఘవేంద్ర రావు

రక్షిత్ అట్లూరి, సంకీర్తన విపిన్ జంటగా వెంకట సత్య దర్శకత్వంలో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'చందమామ కథలోన..' పాట లిరికల్ వీడియోను దర్శకుడు కె. రాఘవేంద్ర రావు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చందమామ కథలోన.. అందమైన పిల్లేనా.. కళ్ల ముందు వాలిందా.. తుళ్లి తుళ్లి పడ్డాన..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా హరి చరణ్, గీతా మాధురి పాడారు. శరవణ వాసుదేవన్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి.

వినోదం..సందేశం


ఇషా, మల్లిక్, సుమన్

మల్లిక్ బాబు, వినయ్, ఇషా, ప్రియాన్స్ హీరో హీరోయన్లుగా, సుమన్ కీలక పాత్రలో నటిస్తున్న సినిమా 'దుమారం'. జీఎల్బీ శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. సుమన్ మాట్లాడుతూ– ''నాయీ బ్రాహ్మణుల వృత్తి, వారు జీవితంలో పడుతున్న ఇబ్బందులను కమర్షియల్ ఫార్మాట్‌లో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఇందులో బార్బర్‌గా చేస్తున్నా. వినోదం, సందేశం అన్నీ ఉన్న చిత్రం అన్నారు. ''హీరో తండ్రి పాత్రను సుమన్ చేస్తున్నారు'' అన్నారు జీఎల్బీ శ్రీనివాస్. ''తొలి చిత్రంలోనే మాస్ క్యారెక్టర్ దొరకడం హ్యాపీ'' అన్నారు మల్లిక్. ''ఈ సినిమా కో ప్రొడ్యూసర్‌గా చేస్తూనే, విలన్ కొడుకు పాత్ర చేస్తున్నా'' అన్నారు పాండు గౌడ్.

రీల్స్

మూడు దశలు.. పెద్ద సవాల్


శ్రీ సింహా కోడూరి

''ఉస్తాద్ కథ మూడు దశల్లో ఉంటుంది. నా పాత్రలో మూడు వేరియేషన్స్ ఉంటాయి. ఇది పెద్ద సవాల్‌గా అనిపించింది. ముఖ్యంగా కాలేజీ ఎపిసోడ్స్ కోసం బరువు తగ్గాను'' అన్నారు శ్రీ సింహా కోడూరి. శ్రీ సింహా కోడూరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా నటించిన చిత్రం 'ఉస్తాద్'. ఫణిదీప్ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, దువ్వూరు హిమాంక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీ సింహా కోడూరి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సూర్య అనే యువకుడి పాత్ర చేశాను. సూర్య కాలేజీకి ముందు ఏం చేశాడు? కాలేజీ లైఫ్ ఎలా సాగింది? పైలట్ ఎలా అయ్యాడు? అనేది ఈ చిత్రకథ'' అన్నారు.

ఫన్... థ్రిల్


శ్రీ కమల్, శివాని

'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు' వంటి పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిలేబి'. అంజు అశ్రాని సమర్పణలో పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ నిర్మించారు. విజయభాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ కథానాయికగా, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. మణిశర్మ సంగీతం ఓ ప్రధాన ఆకర్షణ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


సుమన్, గరీమా

సుమన్, గరీమా చౌహాన్ జంటగా సతీష్ పరమవేద దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. రాచాల యుగంధర్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ పోచంపల్లిలో మొదలైంది. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమా చివరి షెడ్యూల్‌లో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఫైట్ మాస్టర్ డ్రాగన్ ప్రకాష్ నేతృత్వంలో 100 మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమాను దసరాకి రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

దీపావళికి...


శ్రీరామ్

శ్రీరామ్, అయ్యప్ప పి. శర్మ, అజయ్ కీలక పాత్రల్లో బేబీ డమరి సమర్పణలో రూపొందిన చిత్రం 'ఎర్ర చీర'. సుమన్ బాబు, ఎన్వీవీ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం దీపావళికి నవంబర్ 9న రిలీజ్ కానుంది. సుమన్ బాబు దర్శకత్వం వహించారు. ''అమ్మ సెంటిమెంట్, హారర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. 36 నిమిషాల గ్రాఫిక్స్, లక్షలాది మంది అఘోరాలతో తీసిన క్లైమాక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి'' అన్నారు ఎన్వీవీ సుబ్బారెడ్డి, సుమన్ బాబు.